క్లుప్తంగా

మార్చి 23న సామూహిక ఉపనయనాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్‌లోని నాళంవారి సత్రంలో మార్చి 23వ తేదీన వటువులకు ఉచిత సామూహిక ఉపనయనాలు చేయనున్నట్లు బ్రాహ్మణ హెల్ప్‌లైన్ అధ్యక్షుడు టీవీఎల్ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. వివరాలకు 98855 67833, 93914 44441 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

కంబాలచెరువు: స్థానిక ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి డాక్టర్ అదాల విష్ణువర్ధనరెడ్డి అధ్యక్షత వహించారు. 2023 –24 విద్యాసంవత్సరం విద్యార్థులకు ఆహ్వానం పలికారు. అనంతరం వ్యవసాయ రంగంలో ఏపీ సాధించిన ప్రగతిని ఉపకులపతి వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్లు కె.మాధవి, భవాని, ఎ.అనూరాధ, ఎం.విజయశంకర్‌బాబు, టి.ఉషారాణి, సాయి గంగాధర్ పాల్గొన్నారు.

వాహనాలకు వేలం

రాజమహేంద్రవరం రూరల్: నార్త్‌స్టేషన్ పరిధిలో సారా, అక్రమ మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలం ద్వారా రూ.1,63,500 ఆదాయం వచ్చిందని ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు తెలిపారు. ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఆవరణలో శనివారం 17 వాహనాలకు ఆయన పర్యవేక్షణలో నిబంధనలు పాటిస్తూ వేలం నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రూ.80 వేలు ధర నిర్ణయించగా, బిడ్డర్లు రూ.1,63,500కు వాహనాలను దక్కించుకున్నారు. అదనంగా జీఎస్టీ 18శాతం రూ.23,940 ప్రభుత్వానికి చెల్లించారు. వేలంలో ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ప్రకాశం నగర్: స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల ద్వారా పోటీతత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హర్షిత్‌రెడ్డికి ద్వితీయ బహుమతి



ద్వితీయ బహుమతి అందుకుంటున్న హర్షిత్ రెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: ఫార్మా రంగంపై భీమవరంలో జరిగిన సదస్సులో హుకుంపేటకు చెందిన, వీజేఎస్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో చదువుతున్న కొవ్వూరి హర్షిత్‌రెడ్డి చేసిన ప్రదర్శనకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు, వివిధ కంపెనీలు, నైపర్ ప్రతినిధులు, నిర్వాహకులు హర్షిత్‌కు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా హర్షిత్ రెడ్డిని వీజేఎస్ ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ ఎస్.జగన్మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డి.నరేంద్ర, కో ఆర్డినేటర్ కిషోర్ అభినందించారు.

సచివాలయ కన్వీనర్లతో సమావేశం

కడియం: అంకిత భావంతో పనిచేసే పార్టీ కార్యకర్తలను గృహసారథులుగా నియమిద్దామని మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. బుర్రిలంకలోని ఈశ్వరి నర్సరీఫామ్‌లో శనివారం గ్రామ సచివాలయ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరేలా అందరూ కృషి చేద్దామన్నారు. రూరల్ మండల ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

30న మండల పరిషత్ సమావేశం

కడియం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు.

ఫుట్‌బాల్‌లో క్రీడాకారుల సత్తా

- వివిధ టోర్నమెంట్లలో ప్రతిభ
- యువతకు పెరుగుతున్న ఆసక్తి



జాతీయ సంతోష్ ట్రోఫీలో ఆంధ్రప్రదేశ్‌కు జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు (ఫైల్)

ప్రకాశం నగర్: సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో ఫుట్‌బాల్ క్రీడాకారులు తమ సత్తా చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంపికల్లో ప్రతిభ చాటుతున్నారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచి అవార్డులు సాధిస్తున్నారు. ఇటీవల కేరళలో జరిగిన జాతీయ సంతోష్ ట్రోఫీ అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో పి.సాయి సంపత్‌రాజ్, కె.అనిల్ కుమార్, వి.భాస్కర్ ఆంధ్రప్రదేశ్‌కు జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఈనెల 26 నుంచి 30 వరకు సూరత్‌లోని డూమస్ బీచ్‌లో జరిగే హీరో నేషనల్ బీచ్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి మహంతి లోకేష్ కుమార్ ఎంపికయ్యాడు. గతంలో అండర్ -14 విభాగంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫుట్‌బాల్‌కు ప్రాతినిథ్యం వహించి, ఇప్పుడు జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో చోటు దక్కించుకున్నాడు. వీరితో పాటు అంతర్ జిల్లా ఫుట్‌బాల్ చాంపియన్ షిప్, స్కూల్ గేమ్స్ చాంపియన్ షిప్‌లో విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు.

శాప్ గుర్తింపుతో మరింత ఉత్సాహం

ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాల ప్రాంగణంలోని గ్రౌండ్‌ను క్రీడా మైదానంగా గుర్తించింది. దీంతో ఫుట్‌బాల్ క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం పెరిగింది. ప్రభుత్వ గుర్తింపు కారణంగా ఆటల్లో మెలకువలు నేర్పించేందుకు ప్రభుత్వం తరఫున ఒక కోచ్‌ను ఏర్పాటు చేస్తారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి సౌకర్యాల కల్పన, స్పోర్ట్స్ కిట్లు వంటి సదుపాయాలను ప్రభుత్వమే చూసుకుంటుంది. దీంతో ఫుట్‌బాల్ ఆటపై ఆసక్తి ఉన్న క్రీడాకారులకు రాజమహేంద్రవరం వేదికగా మారనుంది. శాప్ గుర్తింపునకు సంబంధించిన విధివిధానాలు త్వరలోనే అమల్లోకి వస్తాయని జిల్లా క్రీడా అధికారులు చెబుతున్నారు.

ఆనందంగా ఉంది



నేషనల్ బీచ్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. చిన్ననాటి నుంచీ ఎస్‌కేవీటీ మైదానంలో కోచ్ బి.మణికంఠ పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్నాను. విశాఖపట్నంలో జరిగిన శిబిరంలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే ధ్యేయంగా శిక్షణ తీసుకుంటున్నాను. – మహంతి లోకేష్ కుమార్

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

- మత్స్యకారులకు అండగా ఉంటాం
- రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



నూతన కమిటీ బోర్డును ఆవిష్కరిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీటీఆర్ఐ: మత్స్యకారుల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన జాంపేట ఫిష్ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర జీడీపీలో మన ఆక్వా ఉత్పతుల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. మత్స్యకార భరోసాతో పాటు సబ్సిడీపై రుణాలు, వాహనాలు అందించే పలు పథకాలు అమలవుతున్నాయన్నారు. జాంపేట ఫిష్ మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వెలమ లక్ష్మణరావు, ఇతర సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వీరబాబు, కంచి ప్రభాకరరావు, వెలమలక్ష్మి, పాపాయమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ సంతోష్

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూత్ రెడ్ క్రాస్, జువాలజీ డిపార్ట్‌మెంట్, జిల్లా పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా' అనే అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్, ఆర్జేడీ డాక్టర్ చప్పిడి కృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు యువతలో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్య వినియోగ నిరోధక చట్టం, వాటిని కలిగివున్న వారికి విధించే శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మూడో పట్టణ సీఐ మధుబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి జీవితంలో నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వసుధ, డాక్టర్ యు.రమేష్ బాబు, దుర్గారావు, డాక్టర్ ఎంఆర్ గౌతమ్ పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ కాంతులు

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా గడప గడపకూ



బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరబూస్తున్నాయని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మాధవరాయుడుపాలెంలోని గుబ్బలవారిపాలెంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ సంబంధిత అధికారులు, నాయకులతో కలసి ప్రతి ఇంటికి వెళ్లి, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అలాగే సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అందరి సంక్షేమమే అజెండాగా జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో మాధవరాయుడుపాలెం ఇన్‌చార్జి సంగీత వెంకటేశ్వర్లు, మురముండ సర్పంచ్ అయినవిల్లి వెంకటేశ్వర్లు, కడియపుసావరం ఇన్‌చార్జి సాపిరెడ్డి సూరిబాబు, ఎంపీడీఓ రత్నకుమారి, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, పార్టీ నాయకులు రాణా హరిశ్చంద్ర, అయితిరెడ్డి అయ్యప్ప, సచివాలయం కన్వీనర్లు సింగన బాబూరావు, ఎస్.ఈశ్వరరావు, ఈ.బాబురావు, సానబోయిన సత్తిబాబు, సానబోయిన శ్రీను పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మాధవరాయుడుపాలెం చైతన్యనగర్‌లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో నమ్మి రాజేశ్వరి భర్త అప్పల నాయుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన విషయం చందన నాగేశ్వర్ దృష్టికి వచ్చింది. దీంతో స్పందించిన ఆయన.. రాజేశ్వరికి ఆర్థిక సాయం అందజేశారు.

నన్నయలో ఆర్ట్ ఎగ్జిబిషన్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఓఎస్డీ ఆచార్య ఎస్.టీకే శనివారం ప్రారంభించారు. ప్రముఖ చిత్రకారుడు పీసీ ప్రసాద్ ఆర్ట్ గ్యాలరీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల మూడు రోజుల పాటు అమలాపురంలో నేషనల్ ఆర్ట్ క్యాంప్ నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొని చిత్రలేఖనంలో తమ ప్రతిభను కనబరిచారు. ఆ చిత్రాలను విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా యూనివర్సిటీలో ఎగ్జిబిషన్‌గా ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 5 వరకూ ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. కార్యక్రమంలో చిత్రకారుడు పీసీ ప్రసాద్, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరం

రాజానగరం: దివాన్ చెరువు సచివాలయం-2లో శనివారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవాసంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘ ప్రతినిధి గ్రంధి నానబ్బులు ప్రారంభించారు.

ఎస్‌కేఆర్‌లో సూర్యకాంత్ త్రిపాఠి జయంతి

కంబాలచెరువు: ప్రముఖ ఛాయావాది, ప్రగతివాది కవి సూర్యకాంత్ త్రిపాఠి జయంతిని శనివారం కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పీజీ సెంటర్ దక్షిణ భారత హిందీ ప్రచార సభ, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ పేరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరాలా రచనల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. హిందీలో నిరాలా రాసిన కొన్ని కవితలను స్వీయానువాదంతో వినిపించారు. మాతృభాషను విస్మరించకుండా హిందీని సులభంగా ఎలా నేర్చుకోవచ్చో వివరించారు. కార్యక్రమంలో సంస్కృత విభాగాధిపతి ఆర్.రాజేశ్వరి, డిగ్రీ విద్యార్థినులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు పాదయాత్ర



దేవీచౌక్‌లో అమ్మవారి ఆలయం వద్ద చిన్న వెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: ద్వారక తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి శిష్యబృందంతో 15వ సారి పాదయాత్ర చేయడం ఆనందంగా ఉందని మహాలక్ష్మీ సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠం అధ్యక్షుడు డాక్టర్ శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు అన్నారు. ఈ మేరకు శనివారం దేవీచౌక్‌లోని బాలాత్రిపుర సుందరీ దేవీ ఆశీసులు తీసుకుని బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. 42 మంది శిష్యులతో పాదయాత్ర ప్రారంభించామన్నారు. మనగుడి - మన సేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి జాతీయ సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాస రెడ్డి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, వైస్ చైర్మన్ టి.వెంకట అప్పారావు, రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, దామోదర వెంకట సత్యనారాయణ, కొత్త పూజిత, డి.పూర్ణిమ రాజ్ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై గోవిందుడు



గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

సీటీఆర్ఐ: స్థానిక లాలాచెరువులోని గాంధీపురం గోవిందక్షేత్రంలో కొలువైన వేంకటేశ్వరస్వామిని శనివారం గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణతో మేళతాళాల మధ్య పురవీధుల్లో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. రథసప్తమి వేడుకలలో భాగంగా భక్తులు ఉదయం ఆదిత్య హృదయం పారాయణ చేశారు. ఆలయ అర్చకులు తూపురాణి శ్రీమన్నారాయణాచార్యులు. రమేష్ స్వామి, ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



బొమ్మూరులో సూర్యనారాయణస్వామిని దర్శించుకున్న చందన నాగేశ్వర్



సీతంపేటలో పూజలో పాల్గొన్న అడపా శ్రీహరి, మార్గాని నాగేశ్వరరావు



పుష్కరఘాట్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో ఉన్న సూర్య మందిరంలో శనివారం రథసప్తమి వేడుకలు, సూర్యనారాయణమూర్తి జయంతిని వైభవంగా నిర్వహించారు. బొమ్మూరుకు చెందిన రాయుడు చిట్టిబాబు,హేమశ్రీ పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణం నిర్వహించారు. జ్యోతిర్లింగార్చనతో రథసప్తమి వేడుకలు ముగిశాయి. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ నేతృత్వంలో టీటీడీ వార్షిక సత్కార పండిట్ ప్రతిష్టాచార్య బ్రహ్మశ్రీ కాళ్లకూరి సూర్యశ్రీ ఆధ్వర్యంలో విల్లూరి సూర్యనారాయణ శర్మ, కాళ్లకూరి శ్రీరామశర్మ అర్చక బృందం బ్రహ్మత్వం నిర్వహించారు. వివేకానంద ఆరోగ్యకేంద్రం అధ్యక్షుడు రిమ్మలపూడి సుబ్బరాజు, సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కాగా.. స్వామిని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దర్శించుకున్నారు. ఆయన వెంట సోమన శ్రీను, మత్సేటి శివ, ఎలుగొండ లక్ష్మి ఉన్నారు.

సీతంపేటలో..

సీటీఆర్ఐ: స్థానిక సీతంపేటలో హోమ శతచండీ సహిత సౌరయాగం వడలి కుమార్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామికి పంచామృతాభిషేకం, విశేష అర్చనలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాల్గొన్నారు. స్వామిని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు.

కేంద్ర కారాగారంలో సూర్యయజ్ఞం

కంబాలచెరువు: రథసప్తమి సందర్భంగా యోగా గురువు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేంద్ర కారాగరంలో శనివారం సూర్యయజ్ఞం నిర్వహించారు. రథసప్తమి విశిష్టత, సూర్య నమస్కారాలు ఉపయోగాలు తెలియజేశారు. సూర్యనమస్కారంతో మధుమేహం, కీళ్ల వ్యాధులు, చర్మ వ్యాధులు, మానసిక సమస్యలను నివారించవచ్చని శ్రీనివాస్ తెలిపారు. జైలు సూపరింటెండెంట్ రాజారావు మాట్లాడుతూ ప్రతాప్ సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యోగాసాధన ద్వారా ఖైదీ సోదరులందరూ పరివర్తన చెందాలన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు ప్రతాప్ రామ్, సత్య ఆంజనేయులు, తాతారావు, జైలర్లు సురేష్ కుమార్, దుర్గారమేష్ పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం

సీటీఆర్ఐ: సూర్య నమస్కారాలు, యోగా ప్రక్రియలు సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని గోదావరి స్విమ్మర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. రథసప్తమి సందర్భంగా గోదావరి స్విమ్మర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు నీలం కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక పుష్కరఘాట్‌లో సూర్యథాన్ పేరిట సూర్య నమస్కారాల సాధన నిర్వహించారు. డాక్టర్ రామచంద్ర పరిగి సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యం బాబు, వినియోగదారుల మండలి అధ్యక్షుడు సుంకర వీరశేఖర్, వాకచర్ల కృష్ణ, ఇన్నమూరి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

కడియం: మాదక ద్రవ్యాల నిరోధంపై శనివారం దుళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తిలక్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ప్రజలు, యువత దూరంగా ఉండాలన్నారు. వాటి మత్తులో పడి జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. ఎస్ఐ అమీనాబేగం, హెచ్‌సీ నారాయణ, హైస్కూల్ హెచ్ఎం కె.సుధ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో నర్సరీ కూలి మృతి

కడియం: ఇనుప నిచ్చెనను పైకిలేపే సమయంలో త్రీఫేజ్ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మండపేట మండలం మోర్నిపాడు గ్రామానికి చెందిన కప్పల నవీన్ (38) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మోర్నిపాడు గ్రామానికి చెందిన కప్పల నవీన్ బుర్రిలంకలోని సదాశివ నర్సరీలో పనులు చేస్తుంటాడు. శనివారం ఇనుప నిచ్చెనను పైకి లేపే సమయంలో త్రీఫేజ్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో నవీన్ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ తిలక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.